క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు


నిసార్‌అహ్మద్


చింతల రామచంద్రారెడ్డి

మదనపల్లె : నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను నియోజకవర్గంలోని ముస్లింలు అందరూ ఆనందంగా జరుపుకొని, అల్లా దీవెనలు అందుకోవాలని ఆకాంక్షించారు.
వాల్మీకిపురం : అల్లాహ్ దయతో ముస్లింలకు అంతా మంచి జరగాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని నియోజకవర్గంలోని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వడదెబ్బపై విస్తృతంగా అవగాహన
– డీఎంహెచ్‌ఓ కొండయ్య

కేవీపల్లె : ఎండలు మండుతుండడంతో ప్రజలకు వడదెబ్బపై విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో కొండయ్య అన్నారు. బుధవారం మండలంలోని జిల్లేళ్లమంద పీహెచ్‌సీ పరిధిలోని మార్లేళ్లలో నిర్వహించిన కుటుంబ వైద్యుల విధానం కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ అన్ని ముఖ్య ప్రదేశాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాలపై మమకారం
– పచ్చిమేత అందజేసిన హెల్పింగ్ మైండ్స్

కురబలకోట : మదనపల్లె పట్టణంలోని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ సంస్థ సభ్యులతో కలసి బుధవారం అంగళ్లు మల్లయ్య కొండపై ఉన్న పశువులకు పచ్చిమేత అందజేశారు. వాటి పట్ల మమకారంతో పాటు దయను కుమ్మరించారు. సాక్షి దినపత్రికలో మేత కోసం అలమటిస్తున్న మూగజీవాలు శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు వెంటనే ఆయన స్పందిస్తూ వాహనంలో పచ్చి మేత తీసుకు వచ్చి పశువులకు వేశారు. సంస్థ సభ్యులు గిరి, కిరణ్, మోహన్, శివ, ఖాజా, సాంబ తదితరులు పాల్గొన్నారు. మూగ జీవాలకు సాయం చేసిన అబూబకర్, సంస్థ సభ్యులను ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి, ఆలయ సేవకులు అభినందించారు.

ఘనంగా ఉట్ల తిరునాల


మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో వెలిసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉట్ల తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆలయం ఎదుట ఆవరణంలోని మైదానంలో ఉట్లమాను యువకులు ఉత్సాహంగా ఎక్కారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. స్థానికులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జ్యోతి ఉత్సవాలతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి
– రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్. ద్వారకనాథరెడ్డి


మాట్లాడుతున్న ద్వారకనాథరెడ్డి

పీలేరు రూరల్ : రాష్ట్రంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్. ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న న్యాయవాదుల బీమా రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచడానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా పునర్విభజనతో పీలేరు కోర్టు నుంచి నాలుగు మండలాలు వేరే కోర్టుకు పోతున్నాయని, వాటి స్థానంలో మన కోర్టుకు నాలుగు మండలాలు కొత్తగా చేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సి. పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు రఫీఅన్సారీ, రామసుబ్రమణ్యం, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇసుకనూతిపల్లెలో ఇఫ్తార్


నిస్సార్‌అహ్మద్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మదనపల్లె సిటీ: మండలంలోని ఇసుకనూతిపల్లెలో బుధవారం జరిగిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ పాల్గొన్నారు. స్థానిక ముస్లింలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, మార్కెట్ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈద్-ఉల్- ఫితర్‌కు సర్వం సిద్ధం

- కనిపించిన నెలవంక
- ప్రార్థనలకు ఈద్గాల వద్ద ఏర్పాట్లు


మదనపల్లెలో ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా మైదానం


మదనపల్లెలో కనిపించిన నెలవంక

మదనపల్లె సిటీ : రంజాన్ పండుగను పురస్కరించుకుని స్థానిక బెంగళూరురోడ్డులోని ఈద్గా ముస్తాబు చేశారు. సామూహిక ప్రార్థనలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని జామియా మసీదు ఇమాం జలాలుద్దీన్ తెలిపారు. జామియా మసీదు నుంచి ఉదయం 7.30 గంటలకు జమాత్‌రూపంలో ఈద్గా మైదానానికి వెళ్లనున్నట్లు తెలిపారు. నమాజ్‌కు మునుపే ప్రతి ముస్లిం రూ.90 ఫిత్రా దానం చేయాలని తెలిపారు.

నెలవంక దర్శనం

పట్టణంలో బుధవారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో షవ్వాల్ నెలవంక దర్శనం కావడంతో గురువారం ఈదుల్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ సర్‌ఖాజీ హాఫీజ్ ఇక్బాల్‌సాహెబ్, పలువురు ఉలేమాలు ఓ ప్రకటన విడుదల చేసి గురువారం ఈద్ పర్వదినాన్ని జరుపుకోవాలని సూచించారు. మదనపల్లె పట్టణంలోని పలు మసీదుల వద్ద బాణాసంచాను పేల్చారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రంలో రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల ఈద్గా కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలో ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక నమాజ్ కోసం శ్రీనివాసపురం రోడ్డులోని ఈద్గా వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ముతవల్లి సిరాజ్‌బాచా, మహబూబ్‌బాషా, మతగురువు ఉస్సామ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ ఉంటుందన్నారు. బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించాలని తెలిపారు. నమాజ్‌కు వచ్చే వారు తమ వెంట జానిమాజ్ తీసుకురావాలని కోరారు.

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

పీలేరు రూరల్ : రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మదనపల్లెరోడ్డులోని ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పట్టణంలోని ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ర్యాలీగా ఈద్గా వద్దకు చేరుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏటా ముస్లింలు క్రమశిక్షణతో ప్రశాంతంగా ఈద్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించుకోవాలని సూచించారు. గురువారం ఈద్‌ఉల్ ఫితర్‌లో భాగంగా ఉదయం 8.30 గంటలకు ప్రార్థనలు ప్రారంభమవుతాయని ముతవల్లీలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, ముతవల్లీలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

12న డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ : ఈనెల 12న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి 12 వరకు సమస్యలను 9959225676 నంబర్‌కు తెలియజేయవచ్చునన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం


ప్రచారం చేస్తున్న చింతల సాయిక్రిష్ణారెడ్డి

వాల్మీకిపురం : సంక్షేమ సారథి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని చింతల సాయిక్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చింతపర్తిలో ఇంటింటికి వెళ్లి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో అర్హులైన పేదలందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. మీ ఇంట్లో మంచి జరిగింటే ఓటేయాలని ముఖ్యమంత్రి అంటున్నారన్నారు. జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకే బాబు పొత్తులు.. సంక్షేమం, అభివృద్ధి సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక చంద్రబాబు ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. 14ఏళ్ల ముఖ్యమంత్రి, 40 ఏళ్ల రాజకీయం అనే చంద్రబాబు ఏనాడు ఒంటరిగా పోటీ చేసింది లేదన్నారు. గతంలో ప్రధాని మోదీని విమర్శించి ఇప్పుడు జగన్‌ను చూసి భయపడి బీజేపీతో పొత్తు పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రమణ, ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, నల్లంకి నరసింహులు, ఫారుఖ్, మెంబరు శీన, విజయ్, చెంగల్ రెడ్డి, రెడ్డి సుబ్రహ్మణ్యం, కిషోర్, హర్ష, రవి, రామ్మోహన, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించాలి


ఎన్నికల ప్రచారంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

కేవీపల్లె : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీలో బలిజపల్లె, కొండారెడ్డిగారిపల్లె, అంబేడ్కర్ కాలనీ, పోతిరెడ్డిగారిపల్లె, బాటవారిపల్లె హరిజనవాడ, చింతమాకులపల్లె తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ వంద శాతం అమలు చేసి మాటమీద నిలబడిన వ్యక్తిగా పేరొందారని పేర్కొన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబుది అంతా మోసం, దగాలతో కూడుకున్నదని, ఎలాగైనా గెలవాలని నోటికొచ్చిన హామీలు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, యర్రమరెడ్డి, రామకొండారెడ్డి, వేణుగోపాల్, నాగ, గౌస్, హరిబాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సజావుగా జరగడానికి సమష్టి కృషి అవసరం

జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



పీలేరు : ఎన్నికల సజావుగా జరగడానికి సమష్టి కృషి అవసరమని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర కూడా కీలకమైందని తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైనా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలు మీడియాకు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు పీలేరు నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ ద్వారా మూడు కేసులు నమోదు చేసి రూ. 21.79 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పోలీసుల తనిఖీలో రెండు కేసులు నమోదు చేసి రూ. 2 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన ఆరు మంది కాంట్రాక్టు ఉద్యోగులు, ఎనిమిది మంది గ్రామ వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌వో రమా, తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తీరుతో వలంటీర్ల రాజీనామాలు

మదనపల్లె : ప్రజలకు సేవ చేస్తుంటే తమపై రాజకీయపార్టీలు నిందలు మోపడం బాధ కలిగించిందని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని 17వ వార్డుకు చెందిన 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల విధి నిర్వహణలో భాగంగా అందుబాటులో లేకపోవడంతో, వార్డు వలంటీర్ల ఇన్‌చార్జ్ సహదేవకు రాజీనామా పత్రాలను అందజేశారు. చంద్రబాబు, పవన్, బీజేపీ తీరుపై మనస్తాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. గత 50 నెలలుగా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందజేసి, నిస్వార్థసేవలు చేశామన్నారు. ఎలాంటి రాజకీయాలకు ప్రభావితంగా కాకుండా, ప్రజలకు సేవ చేస్తుంటే తమపై రాజకీయపార్టీలు నిందలు వేస్తున్నాయన్నారు.

20 మంది గ్రామ వలంటీర్ల రాజీనామా

ములకలచెరువు : మండలానికి చెందిన 20 గ్రామ వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. వారి రాజీనామా పత్రాలను ఎంపీడీఓ పోలప్పకు అందజేశారు. మండలంలోని 16 పంచాయతీల్లోని 212 మంది వలంటీర్లకుగాను ఇప్పటిదాకా 166 మంది రాజీనామా సమర్పించారు.

కదిరాయచెర్వు వలంటీర్‌లు రాజీనామా

కలకడ : కదిరాయచెర్వు సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు బుధవారం రాజీనామా పత్రాలను ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం కదిరాయచెర్వు గ్రామంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు జివి కిషోర్‌ను కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డి, ఎంపీగా పివి మిథున్‌రెడ్డిని గెలిపించడానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు

కలికిరి : మండలంలోని గుండ్లూరు, మేడికుర్తి, మహల్ గ్రామాలకు చెందిన వలంటీర్లు తమ విధులకు బుధవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. గుండ్లూరు గ్రామ పరిధిలో 13 మంది, మేడికుర్తి గ్రామ పరిధిలో 14 మంది, మహల్‌కు చెందిన ఆరు మంది వలంటీర్లు ఆయా గ్రామా సచివాలయాలకు చేరుకుని రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శిలకు అందజేశారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

వాల్మీకిపురం : మండలంలోని వాల్మీకిపురం, చింతపర్తిలో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజకీయ పరంగా వలంటీర్లపై అనవసర ఆరోపనల నేపథ్యంలో రెండు పంచాయతీల వలంటీర్లు బుధవారం రాజీనామా చేసినట్లు తెలిపారు.

పీలేరులో 25 మంది..

పీలేరు : మండలంలో 25 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. మండలంలోని కాకులారంపల్లె గ్రామ సచివాలయం పరిధిలో 22 మంది గ్రామ వలంటీర్లు తమ రాజీనామా పత్రాలు పంచాయతీ కార్యదర్శి భూపతికి అందజేశారు. అలాగే పీలేరు పట్టణానికి చెందిన ముగ్గురు గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు.

తంబళ్లపల్లెలో 38 మంది ..

తంబళ్లపల్లె : మండలంలో బుధవారం 38 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసి, పత్రాలను ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆనంద్‌కు అందజేశారు. బాలిరెడ్డిగారిపల్లెలో 7 మంది, కోసువారిపల్లె 18, కోటకొండలో 1, గోపిదిన్నె 02, కన్నెమడుగు 01, తంబళ్లపల్లె 07, కుక్కరాజుపల్లె 02 గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు.

వలంటీర్ల రాజీనామా

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం, పీటీఎం-2 గ్రామ సచివాలయ పరిధిలో పని చేస్తున్న 52 మంది గ్రామ వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. చేసిన ఫిర్యాదును జీర్ణించుకోలేక తామంతా విధుల నుంచి తప్పుకుంటున్నామని రాజీనామాలను ఎంపీడీవో బ్రహ్మనందరెడ్డికి అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తంబళ్లపల్లె : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటశివకుమార్, ఎస్ఐ వెంకటేష్ బుధవారం తెలిపారు. మండలంలోని ఆర్ ఎన్ తండా సమీపంలో కర్ణాటక మద్యం అమ్ముతున్న గోవిందు(45)ను అదుపులోకి తీసుకుని, 336 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ములకలచెరువు : ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. బుధవారం వేపూరికోట, దేవులచెరువు, పర్తికోట పంచాయతీల్లో కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది కవాతు చేపట్టారు. అనంతరం ప్రజలకు శాంతి భద్రతలపై వివరించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

వాల్మీకిపురం : వాల్మీకిపురం శ్రీ పట్టాభి రాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, శుక్రవారం ఉదయం ధ్వజారోహణము , రాత్రి గజ వాహన సేవ, శనివారం ముత్యపుపందిరి వాహనము , రాత్రి హనుమంత వాహనం, ఆదివారం కల్పవృక్ష వాహనము, రాత్రి సింహవాహనం, సోమవారం సర్వభూపాల వాహనం, రాత్రి పెద్ద శేష వాహనం , మంగళవారం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం , రాత్రి మోహినీ అవతారం, 17న తిరుచ్చి ఉత్సవం, రాత్రి సీతారాముల కళ్యాణోత్సవం, గరుడ సేవ నిర్వహించనున్నారు. అలాగే 18న రథోత్సవం, సాయంత్రం ధూళి ఉత్సవం, 19న ఉదయం తిరుచ్చి ఉత్సవం , రాత్రి పార్వేట ఉత్సవం, అశ్వ వాహనం, 20న ఉదయం వసంతోత్సవము, చక్రస్నానం, రాత్రి హంస వాహనం, ధ్వజావరోహణము. 21న స్నపన తిరుమంజనం, పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.